క్లుప్తంగా

వయొలిన్ సోలో కచేరి



నగరంపాలెం(గుంటూరు ఈస్ట్): స్థానిక లక్ష్మీపురం త్యాగరాజ కళావేదికపై త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో శనివారం వయొలిన్ సోలో కచేరి నిర్వహించారు. విద్వాన్ వారణాసి శ్రీకృష్ణరాఘవ(హైదరాబాద్) వాయొలిన్ సోలో శాస్త్రీయ సంగీత కచేరి నవ రాగమాలిక వర్ణంతో ప్రారంభించారు. శ్రీత్యాగరాజ కీర్తనలు, వాగ్గేయకారుల కీర్తనలను వయొలిన్‌పై శ్రావ్యంగా ఆలపించారు. మృదంగంపై విద్వాన్ సీహెచ్ సూర్య(గుంటూరు), ఘటంపై విద్వాన్ ఎ.కౌండిన్య (హైదరాబాద్) వాయిద్యాన్ని అందించారు. అనంతరం కళాకారులను కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్, ఉపాధ్యక్షులు ఎస్.గిరిజా శంకర్, సలహాదారు నేతి విశ్వేశ్వరరావు సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు(గుంటూరు): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్-2 డీఈఈ ఎన్.గురవయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ ఉండదని చెప్పారు. అశోక్‌నగర్, బ్రాడీపేట, కంకరగుంట గేట్ తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తొగట వీర క్షత్రియులకు ఫైనాన్స్ కార్పొరేషన్ కావాలి

నెహ్రూనగర్: తొగట వీర క్షత్రియులకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆదుకోవాలనిమ తొగట వీర క్షత్రియ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మిశెట్టి కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు కొనగళ్ల నారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కోశాధికారి ఎస్.శ్రీనివాసరావు, యువజన సంఘం అధ్యక్షులు అరుణ్ బాబు, ప్రచార కార్యదర్శి శీలం వెంకటేశ్వర్లు, పల్నాడు, గుంటూరు జిల్లా అధ్యక్షులు సీహెచ్ బాలయ్య, అనంత మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి పూజల అర్జున్ పాల్గొన్నారు.

ఇరువురు ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రదానం



గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవానికి హాజరుకాలేకపోయిన ఇద్దరు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శనివారం డీఈఓ కార్యాలయంలో పురస్కారాలు ప్రదానం చేశారు. నగరపాలకసంస్థ పాఠశాలల్లో పని చేస్తున్న కొలకలూరి అంకులు, ఎస్.రాజకుమారిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకయ్య, యు.మహంకాళరావు, నాయకులు కొరివి విజయబాబు, వై.శ్యాంబాబు, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు శ్రీవారి దర్శనం నిలిపివేత



నగరంపాలెం: ఈనెల ఏడో తేదీ (ఆదివారం) చంద్రగ్రహణం సందర్భంగా బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి దర్శనం నిలిపివేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు, అర్చకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం ఉదయం తొమ్మిది గంటల వరకు మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఉదయం సంప్రోక్షణానంతరం స్వామి వారి దర్శనానికి భక్తులను అనుమతిస్తామని చెప్పారు.

ఆస్తి పన్నులపై ప్రత్యేక డ్రైవ్

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో సోమవారం నుంచి అన్ అసెస్మెంట్, అండర్ అసెస్మెంట్‌కు ఆస్తి పన్ను విధింపు, పన్ను బకాయిల వసూలుపై రోజువారీ ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం కమిషనర్ చాంబర్‌లో డెప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఆస్తి, ఖాళీ స్థల పన్ను, నీటి మీటర్ల చార్జీల వసూళ్లలో పురోగతి లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. బకాయిల్లో టాప్ 100 డిఫాల్టర్ల దగ్గరకు డెప్యూటీ కమిషనర్లు నేరుగా వెళ్లాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు మదన్ గోపాల్, సాదిక్ పాష, రెహ్మాన్ పాల్గొన్నారు.

వెన్నుదన్ను కీలకం

- స్పైనల్ కార్డు దెబ్బతింటే మంచానికే పరిమితం
- వెన్నుముక గాయాలపై అవగాహన ఉండాలి
- ఇది అవగాహన వారం



గుంటూరు మెడికల్: మానవ శరీరంలో కీలకమైన వెన్నెముకకు ఏదైనా దెబ్బతగిలినప్పుడు మనిషి కూర్చోలేక, నిలబడలేక మంచానికే పరిమితమైపోతాడు. మనిషిని నిటారుగా నిలబెట్టే వెన్నెముకకు గాయాలైనప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోని పక్షంలో జీవితాంతం మనిషి మంచానికే పరిమితమై అవస్థలు పడుతుంటాడు. గాయాలపై ప్రజలకు అవగాహన లేకపోవడం, అపోహలు ఉండటం ద్వారా అనేక మంది చికిత్సలకు దూరంగా ఉంటున్నారు. ప్రజలకు స్పైనల్ కార్డ్ ఇంజూరిస్‌పై అవగాహన కల్పించేందుకు సెప్టెంబరు 1 నుంచి 7 వరకు అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నారు.

కారణాలు

సాధారణంగా రోడ్డు ప్రమాదాల వలన వెన్నుముక గాయం ఏర్పడుతోంది. వాహనాలపై ప్రయాణిస్తున్న సమయంలో అదుపు తప్పి పడిపోవడం, మరో వాహనం ఢీకొనడం ద్వారా కిందపడిన వ్యక్తి వెన్నెముక విరిగిపోతోంది. చెట్లు ఎక్కినరికే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోకపోతే, ఎత్తు భవనాలపై పనిచేస్తున్న సమయంలో అప్రమత్తంగా లేకపోతే కిందపడిపోయి వెన్నెముక విరుగుతోంది. ఇలాంటి వారికి అత్యాధునిక శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయి. అయితే శస్త్రచికిత్స చేసినప్పటికీ గాయమైన సమయంలో వెన్నెముక చుట్టుపక్కల ఉండే నరాలు పటుత్వం కోల్పోయి సదరు వ్యక్తి నడక ఇబ్బందిగా మారుతోంది. ఇలాంటి వారికి రీహాబిలిటేషన్ చికిత్స ద్వారా నరాల్లో ఉన్న పటుత్వం ద్వారా నడకను సరిచేయవచ్చు.

బాధితులు అధికమే ...

భారతదేశంలో 1.5 మిలియన్ల మంది వెన్నెముక గాయాలతో బాధపడుతున్నారు. ప్రతి ఏడాది 20 వేల మంది కొత్తగా రోడ్ల ప్రమాదాల వల్ల, ఎత్తు భవనాలు, చెట్లపై నుంచి పడి వెన్నుముక సమస్యలతో బాధపడుతున్నారు. కొంత మంది ఇన్‌ఫెక్షన్ల ద్వారా, వెన్నెముక టీబీ ద్వారా సమస్యల బారిన పడుతున్నారు. బాధితుల్లో 80 శాతం పురుషులు, 20 శాతం మహిళలు ఉన్నారు. వీరిలో సగం మంది 15 నుంచి 30 సంవత్సరాల వయస్సు వారే. యుక్త వయస్సులో ఏదో పనిచేస్తూ లేదా ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులకు ఆర్థికపరమైన అంశాల్లో చేదోడు, వాదోడుగా ఉండాల్సిన వారు వెన్నుముక గాయాల వల్ల మంచానికే పరిమితమై తల్లిదండ్రులకు భారంగా మారుతున్నారు. జిల్లాలో స్పాయిన్ సర్జన్స్ వద్దకు ప్రతినెలా 10 నుండి 15 మంది బాధితులు స్పనల్ ఇంజురితో చికిత్స కోసం వస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 150 మంది ఆర్థోపెడిక్ సర్జన్స్ ఉన్నారు. ప్రతినెలా ఐదుగురు వెన్నుముక గాయాల బాధితులకు వీరు చికిత్స అందిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం...



స్పైనల్ కార్డ్ గాయాలపై ప్రజలకు అవగాహన లేకపోవడం ద్వార జీవితాంతం మంచానికే పరిమితమై అవస్థలు పడుతున్నారు. ప్రతినెలా పది మందికి పైగా బాధితులు చికిత్స కోసం మా ఆస్పత్రికి వస్తున్నారు. ప్రాథమిక దశలో చికిత్స చేయించడం ద్వారా సర్జరీలతో పనిలేకుండా ఫిజియోథెరపి, ఇతర చికిత్స విధానాల ద్వారా వెన్నెముక గాయాలను నయం చేయవచ్చు. మల్లికా స్పైన్ రీహాబ్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వెన్నుముక గాయాలను అశ్రద్ధ చేయకుండా ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయడం ద్వారా త్వరితగతిన కోలుకోవచ్చు.

–డాక్టర్ జి.నరేష్‌బాబు, సీనియర్ స్పైన్ సర్జన్, గుంటూరు

లక్షణాలు..

- వెన్నెముక గాయమైన వారికి స్పర్శ, చలనం ఉండదు. వెన్నుముక భాగమంతా కదలిక లేక నడవలేకపోవడం, మలమూత్రాలను అదుపులో పెట్టుకోలేక మంచంలోనే విసర్జించడం జరుగుతోంది.
- వెన్నుముక ఆపరేషన్ చేసిన నరాలు చచ్చుబడిపోవడం వల్ల నడక ఇబ్బందిగా మారుతోంది
- ఇలాంటి వారికి రీహాబిలిటేషన్ ద్వారా ఉన్న నరాల పటుత్వం ద్వారా నడక నేర్పించవచ్చు
- ఏపీలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విశాఖపట్నంలో రీహాబిలిటేషన్ సెంటర్ పనిచేస్తుంది.

హోల్ సేల్ వ్యాపారులకు అనుమతి తప్పనిసరి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూ నగర్: ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా హోల్ సేల్ వ్యాపారం నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహించడానికి వీలు లేదని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. అనుమతులు లేకుండా హోల్ సేల్ వ్యాపారాలు చేస్తున్న వారితో, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రైవేట్‌గా హోల్ సేల్ మార్కెట్ నిర్వహించాలి అంటే వివిధ ప్రభుత్వ శాఖల నుంచి సుమారు 16 రకాల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కొల్లి శారద నగరపాలక సంస్థ హోల్ సేల్ మార్కెట్‌లో దుకాణాలకు చట్ట ప్రకారమే బహిరంగ వేలం నిర్వహించినట్లు చెప్పారు. ఇప్పటికే షాపులు వేలంలో దక్కించుకున్న వారిలో 41 మంది షాపులను ఆక్యుపై చేశారన్నారు. కాని కొందరు నగరపాలక సంస్థ హోల్ సేల్ మార్కెట్‌కి రైతులు కూరగాయలు తీసుకురాకుండా వేరే ప్రాంతాల్లో మార్కెట్ ఉందని మోసపూరిత ప్రకటనలు ఇస్తున్నారని పేర్కొన్నారు. అటువంటి వారి పై చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. ప్రైవేట్‌గా హోల్ సేల్ మార్కెట్ ఏర్పాటు చేసుకోవాలి అనుకునేవారు సంబంధిత నిర్దేశిత విధానంలో అనుమతులకు దరఖాస్తు చేసుకొని, అనుమతులు వచ్చిన అనంతరమే వ్యాపారాలు చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం అనుమతులు లేకుండా జాతీయ రహదారి వెంబడి మార్కెట్ ఏర్పాటు చేయడానికి ప్రయతిస్తున్న వారు తగిన అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని, అనుమతుల మంజూరు కు నగరపాలక సంస్థ సహకరిస్తుందని వివరించారు. సమావేశంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ఎండీ నజీనా బేగం, కార్మిక శాఖ డెప్యూటీ కమిషనర్ ఏ గాయత్రి, సీపీడీసీఎల్ ఈఈ శ్రీనివాసరావు, భూగర్భ జల శాఖ డీడీ డి.వందన, మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణ చౌదరి, పాత గుంటూరు ఎస్‌హెచ్‌ఓ కే వెంకట ప్రసాద్, హార్టికల్చర్ డీడీ రవి, జీఎంసీ రెవెన్యూ అధికారి సాధిక్ పాషా, రెవెన్యూ ఇన్ స్పెక్టర్ ఖాజావలి పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన కమిషనర్

వీధి దీపాల సమస్య రాకూడదు

నగరంలో ఈ నెల 10వ తేదీ నాటికి వీధి దీపాల మరమ్మతులు నూరు శాతం పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ అధికారులు, ఎమినిటి కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ అధికారులు వీధి దీపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, 10వ తేదీ అనంతరం స్తంభాలకు లైట్లు ఉండి వెలగకపోతే ఎమినిటి కార్యదర్శి, ఏఈనే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. స్తంభాలు ఉండి లైట్లు లేని వాటికి 20వ తేదీ నాటికి ఏర్పాటు చేయాలని చెప్పారు. సమావేశంలో ఎస్ఈ సుందరామిరెడ్డి, ఈఈలు కోటేశ్వరరావు, విష్ణు, వేణు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు జరుగుతున్న సమయంలో ఎమినిటి కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శనివారం నగరంపాలెం దర్గా వెనుక రోడ్‌లో సీసీ రోడ్ నిర్మాణ పనులను, అమరావతి రోడ్ లో పారిశుద్ధ్య పనులను, విద్యా నగర్ ఎక్స్‌టెన్షన్ లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న బహుళ అంతస్తు భవనాన్ని పరిశీలించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందనలు



ఉపాధ్యాయినులను అభినందిస్తున్న డీఈఓ రేణుక



ప్రిన్సిపాల్ ఐజాక్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం ప్రమీల

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళా విద్యకు చిరునామాగా నిలిచి, వందేళ్ల చరిత్ర కలిగిన శారదానికేతన్ విద్యాసంస్థల నుంచి రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందుకోవడం మంచి పరిణామమని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక తెలిపారు. బ్రాడీపేటలోని శారదానికేతన్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల నుంచి రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం పొందిన గణిత శాస్త్ర ఉపాధ్యాయిని పి.సునీత రజని, జిల్లాస్థాయిలో పురస్కారం అందుకున్న హిందీ ఉపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్నకుమారిని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శనివారం తన కార్యాలయంలో అభినందించారు. శతాబ్ది చరిత్ర కలిగిన శారదానికేతన్ విద్యాసంస్థలు ఈ ఏడాది రెండు ప్రతిష్టాత్మక డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ ఉపాధ్యాయ ప్రతిభా పురస్కారాలు అందుకోవటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, శారదా నికేతన్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్.ఉషాకుమారి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్న చౌత్రాలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు యు.రమాదేవిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.పద్మజ, మండల విద్యాశాఖాధికారి షేక్ ఎండీ ఖాసిం అభినందించారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొని అభినందనలు తెలిపారు.

విజ్ఞాన దీపికలు గురువులు

గుంటూరు ఎడ్యుకేషన్: అజ్ఞానాన్ని పారద్రోలే విజ్ఞానదీపికలు గురువులని కెనడీ విద్యాసంస్థల డైరెక్టర్లు కె.శ్రీకాంత్‌బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య పేర్కొన్నారు. అరండల్‌పేటలోని కెనడీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.ఐజాక్‌కుమార్‌తో పాటు ఉపాధ్యాయ బృందాన్ని సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకురాలు సావిత్రి పాల్గొన్నారు.

వెంగళరావునగర్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: వెంగళరావునగర్‌లోని నగరపాలకసంస్థ బాలికోన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలకు ఉద్యోగోన్నతిపై వచ్చిన కె.మారుతీదేవి, పి.విజయలక్ష్మి, గుర్రం లక్ష్మీదేవిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.ప్రమీల, పి.రమేష్ సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.సుజాత, ఆర్. మంగ, టి.సుష్మారెడ్డి, పి.దివ్య, ఎం.వెంకటలక్ష్మి, టి.తేజోవతి, వై.మధు, ఆర్. అనూష, పి. రామయ్య పాల్గొన్నారు.

అమెరికా టారిఫ్‌లపై వామపక్షాల నిరసన

లక్ష్మీపురం: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతీయ సరుకులపై సుంకాన్ని 50 శాతం పెంపు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం గుంటూరు హిమని సెంటర్ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, టారిఫ్ పెంపు కారణంగా రాష్ట్ర ఆక్వా, టెక్స్‌టైల్స్, గార్మెంట్స్ రంగాలు తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రొయ్యల ధరలు పడిపోవడంతో తీరప్రాంత ఆక్వా రైతులు సంక్షోభంలో ఉన్నారని చెప్పారు. వేలాది మహిళా కార్మికుల ఉపాధి ప్రమాదంలో పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వీసా నిబంధనల కఠినతరం వల్ల విద్యార్థుల భవిష్యత్ కూడా అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్, సీపీఎం నాయకుడు దండ లక్ష్మీనారాయణ, సీపీఐ ఎంఎల్ ప్రజా పోరు జిల్లా కార్యదర్శి పాటిబండ్ల కోటేశ్వరరావు, సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్, వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న వామపక్షాల నేతలు

ఫ్లైఓవర్ పనుల్లో అశ్రద్ధ వద్దు

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు వెస్ట్: నగరంలో నిర్మిస్తున్న శంకర్ విలాస్‌తో పాటు మిర్చియార్డు ఫ్లెఓవర్ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, శాసన సభ్యులు గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులుతో సమావేశం నిర్వహించారు. పెమ్మసాని మాట్లాడుతూ 2023లోనే మిర్చియార్డు వద్ద రూ.30 కోట్లతో ఫ్లెఓవర్ మంజూరు అయిందన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అప్పుడు పనులు ముందుకు సాగలేదని తెలిపారు. నిర్మాణంలో ఎన్టీఆర్ విగ్రహం అడ్డువస్తుందని అధికారులు తెలపడంతో కొంత వెనక్కి జరిపే ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. గళ్లా మాధవి మాట్లాడుతూ మిర్చి యార్డు నిర్మాణం పనులు నత్తనడకగా సాగుతున్నాయన్నారు. 7 నెలల్లోనే ఒక స్ట్రక్చర్ నిర్మాణం చేసి అందజేస్తామంటున్న అధికారులు ఆ దిశగా ముందుకెళ్లాలని కోరారు. శంకర్ విలాస్ మాత్రం చాలా వేగంగా పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

ముస్లింలకు మేలు చేసిన ఘనత వైఎస్సార్‌దే

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు: రాష్ట్రంలో నిస్వార్థంగా ముస్లిం మైనారిటీలకు మేలు చేసిన ముఖ్యమంత్రులు ఇద్దరే ఇద్దరని.. వారు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, మరొకరు ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన షేక్ ఖాసిం శనివారం ఎమ్మెల్సీని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా నియమితులైన ఖాసీంను దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ కుటుంబం వలనే ముస్లిం మైనారిటీల జీవితాలలో వెలుగులు విరబూశాయని తెలిపారు. నాడు మహానేత వైఎస్సార్ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లతో వారి సంక్షేమానికి ముందడుగు వేయగా... ఆయన తనయుడు జననేత వైఎస్ జగన్ మరో నాలుగడుగులు ముందుకు వేసి వారికి అన్ని రంగాల్లో సమాన వాటా కల్పించారని గుర్తు చేశారు. దశాబ్దాల కాలం నుంచి పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా వెనుకబాటుతనానికి గురై అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయిన వారి సంక్షేమం కోసం జగన్ అనేక ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేశారన్నారు. ముస్లింల పేదరికానికి ప్రధాన కారణం నిరక్షరాస్యత అన్న వాస్తవాన్ని ప్రజా సంకల్ప పాదయాత్ర ద్వారా ముందే గ్రహించిన జగన్, తాను ముఖ్యమంత్రి అయిన వెంటనే ప్రణాళికాబద్ధంగా వారిలో అక్షరాస్యతా శాతం పెంపునకు కృషి చేశారని తెలిపారు. పార్టీ పదవుల్లోనూ తగిన ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మార్కెట్ బాబు, ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), 39వ డివిజన్ అధ్యక్షుడు షఫి, పార్టీ నేతలు పిల్లుట్ల మోహనరావు, అద్దంకి రాజా, మున్నా, బాజి, సుభాని, సాదిక్, సత్తార్, బాషా, ఇస్మాయిల్ బాబు, బీసీ నేత ఓర్సు శ్రీనివాసరావు, షేక్ రబ్బానీ, మంత్రి మహానంది పాల్గొన్నారు.



ఖాసీంను అభినందిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

భక్తిశ్రద్ధలతో వినాయకుడి గ్రామోత్సవం



వినాయకుని గ్రామోత్సవంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా..

పట్నంబజారు: లంబోదరుడుకి... రథసారధి అయ్యాడు... విఘ్నేశ్వరుడి వేడుకలో.. వేదమంత్రాల సాక్షిగా.. జరిగిన భారీ ఊరేగింపులో గణనాథుడికి ప్రణమిల్లుతూ.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి శనివారం తొలి పూజా దేవుడుకు రథసారథిగా మారారు. నగరంలోని అరండల్ పేట 11 లైన్ లో కార్పొరేషన్ కో ఆప్షన్ మెంబర్ ఆల సాంబశివరావు ఆధ్వర్యంలో జరుగుతున్న 41వ వినాయక చవితి వేడుకల్లో ఎమ్మెల్సీ అప్పిరెడ్డి పాల్గొన్నారు. స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ యువతలో ఉత్సాహాన్ని నింపారు. ఊరేగింపు నగరంలో జరుగుతున్న క్రమంలో ఆయనే వాహనాన్ని నడుపుతూ ముందుకు సాగారు. కార్యక్రమంలో వినాయక చవితి ఉత్సవ కమిటీ ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు ఓర్సు శ్రీనివాసరావు, రెడ్డి కోటేశ్వరరావు, పానుగంటి చైతన్య, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వినాయక పందిళ్లలో ప్రత్యేక పూజలు

పట్నంబజారు: చవితి నవరాత్రుల్లో భాగంగా వినాయక గ్రామోత్సవాల్లో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయ కర్త షేక్ నూరిఫాతిమా ప్రత్యేక పూజలు నిర్వహించారు. 9, 15, 51 డివిజన్ పరిధిలో చవితి పందిళ్లలో పాల్గొని, అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో 15వ డివిజన్ అధ్యక్షుడు వాకా శ్రీను, 51వ డివిజన్ అధ్యక్షుడు తుమ్మేటీ కృష్ణ, సత్యబాబు, తుమ్మేటీ శ్రీను, పూనూరి నాగేశ్వరరావు, చింకా శ్రీను, చందు, ప్రశాంత్, అయ్యప్ప, రాజేష్, నక్కా రవి, మాధవరావు, మంగపతి రావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా గణనాథుని నిమజ్జన ఊరేగింపు



నగరంపాలెం: స్థానిక ఏటుకూరురోడ్డు శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద కొలువైన గణనాథుని నిమజ్జన ఊరేగింపు శనివారం వైభవంగా నిర్వహించారు. వాసవి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామోత్సవానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తూర్పు ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్ హాజరయ్యారు. అనంతరం మంగళ వాయిద్యాలు, కేరళ, తీన్మార్ డప్పులు, దేవతామూర్తుల వేషధారణలు, మహిళా భక్తుల కోలాటం అలరించాయి. కార్యక్రమంలో వాసవి యూత్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల నాగేశ్వరరావు, కార్యదర్శి పువ్వాడ నాగవెంకటనారాయణ, కోశాధికారి కాజా శ్యాంసుందర్, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ అన్నారామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు మరో సమ్మెకు సిద్ధం కావాలి

యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు రమణ పిలుపు

లక్ష్మీపురం: రాష్ట్రంలోని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్‌కు జీతాల పెంపు కోసం మరో సమ్మెకు సిద్ధంగా ఉండాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షులు వై.రమణ పిలుపు నిచ్చారు. స్థానిక సీఐటీయూ నగర కార్యాలయంలో యూనియన్ గుంటూరు ప్రాజెక్టు మహాసభ శనివారం ప్రధాన కార్యదర్శి టి.రాధ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్నా ఇంతవరకు జీతాలు పెంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాటాల ద్వారా మాత్రమే హక్కులు సాధించుకోగలమని, సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీలు అందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. యూనియన్ నగర గౌరవ అధ్యక్షులు కట్లగుంట శ్రీనివాసరావు మాట్లాడుతూ యూనియన్ జిల్లా మహాసభలు ఈనెల 11వ తేదీన గుంటూరు జిల్లా సీఐటీయూ కార్యాలయంలో జరుగుతుందన్నారు. సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు మాట్లాడారు. అనంతరం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) గుంటూరు ప్రాజెక్టు నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కట్లగుంట శ్రీనివాసరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పద్మావతి, అస్మత్ తారా, ఉపాధ్యక్షులుగా భాగ్యరేఖ, నాగేశ్వరి, సహాయ కార్యదర్శులుగా జె.రమ, శివలీల, రోజమ్మ, కోశాధికారిగా టి.రాధాను ఎన్నుకున్నారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్స్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

నెహ్రూనగర్: అనారోగ్య కారణాతో మృతి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్స్ కుటుంబ సభ్యులకు తోటి కానిస్టేబుల్స్ అండగా ఆర్థిక సాయం అందజేయడం అభినందనీయమని ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఎక్సైజ్ శాఖలో పనిచేస్తూ అనారోగ్య కారణాలతో మృతిచెందిన కానిస్టేబుల్స్ కుటుంబ సభ్యులకు శనివారం బ్రాడీపేటలో ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో సాయం అందజేశారు. ఈ సందర్భంగా ది గుంటూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్స్ అండ్ హెడ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మార్పు కోటయ్య మాట్లాడుతూ కె.శ్రీనివాసనాయుడు, సీహెచ్ శ్రీనివాసరావు, కెసీహెచ్ కాటయ్య ఎక్సైజ్ కానిస్టేబుల్స్‌గా పనిచేస్తూ వివిధ ఆరోగ్య సమస్యల కారణంగా మృతి చెందారని.. వారి కుటుంబ సభ్యులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో జిల్లాలోని ఎక్సైజ్ కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్స్‌గా పనిచేస్తున్న ఒక్కొక్కరు రూ.500 చొప్పున ఆర్థిక సాయం పోగు చేసి ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.98 వేలు చొప్పున రూ.2.88 లక్షలను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఈఎస్ అరుణకుమారి, ఏఈఎస్ మారయ్యబాబు, అసోసియేషన్ నాయకులు ఎం.లక్ష్మణరావు, ఎం.శ్రీనివాసరావు, జీ కొండలరావు, కె.రజనీ, పీ రమేష్, ఎం.కోటేశ్వరరావు, ఎన్.రవిశంకర్, సీహెచ్ ఆంజనేయులు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

